


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కనబడుటలేదు.

**లేండింగ్ అనౌన్స్‌మెంట్** వచ్చాక కిటికీలోంచి కిందికి చూసాను. పొడవాటి చెట్లు, కొండలు, పొగమంచు. రోడ్డుమీద వెళ్తున్న కార్లు. విమానం బాగా కిందికి దిగింది. మేఘాల తెరలోంచి చెట్లు బూడిద రంగులో కనిపిస్తున్నాయి. సన్నగా జల్లుపడుతోంది. పైలట్ ఎలాంటి కుదుపు లేకుండా మృదువుగా రన్‌వే మీద విమానాన్ని దింపాడు. అది ఏరో బ్రిడ్జ్ వైపు చక్రాలమీద నెమ్మదిగా కదులుతోంది.

బర్గన్! నార్వేలోని ఈ ప్రాంతానికి వస్తానని నేను కలలో కూడా అనుకోలేదు. నిజానికి నాలుగైదేళ్ళ క్రితందాకా నాకు ఈ పేరుతో ఓ నగరం ఉందని కూడా తెలీదు.

ఆఫీస్ వాళ్ళు మూడువారాల ప్రాజెక్ట్ పనికోసం ఆస్లో వెళ్ళమని చెప్పినప్పుడు నాకు అమిత ఆనందం కలిగింది. పనిమీద అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ వెళ్ళినా స్కాండినే వియన్ కంట్రీస్‌కి వెళ్ళలేదనే వెలితి ఉండేది.

వెంటనే నా ఫ్రెండ్స్ గ్రూప్‌లో పోస్ట్ చేసాను.

'హై గైయ్స్ ఆస్లో వస్తున్నాను. ఆ చుట్టుపక్కల ఏ వెధవన్నా ఉన్నాడా?'

ఐదు నిమిషాల్లో నాకు ఆకాష్ నించి ఫోన్ వచ్చింది.

"ఈ వెధవ అక్కడికి దగ్గర్లోనే ఉన్నాడు. ఎన్ని వారాలు?" అడిగాడు.

నా పని మూడు వారాలే అని చెప్పాక, నాలుగోవారం ఇంట్లోంచి పని చేస్తానని చెప్పమన్నాడు. ఆ వారం బర్గన్‌లో ఉండి, అక్కడినించి ఆమస్టర్ డాం మీదుగా ఇండియా వెళ్ళేట్లుగా ప్లాన్ చేసుకున్నాం.

ఏర్‌పోర్ట్ అంత సందడిగా ఏమీలేదు. అంతా నిశ్శబ్దంగా ఎవరిపని వాళ్ళు చూసుకుంటున్నారు. బయటకి రాగానే ఆకాష్ కనిపించాడు. నన్ను గాఢంగా ఆలింగనం చేసుకుని చెప్పాడు.

"ఐఐటిలో అత్తెసరుగాళ్ళు."

ఇద్దరం పెద్దగా నవ్వుకున్నాం. తన పక్కన అధునాతనంగా స్కర్ట్, బ్లౌజ్ భుజాలదాక కత్తిరించిన జుట్టుతో ఉన్న అమ్మాయిని పరిచయం చేసాడు.

"సంజన నా వైఫ్. సంజూ వీడే నాలుగేళ్ళ నా రూమ్మేట్‌గాడు."

ఆ రాత్రంతా ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. సంజన పదకొండు గంటలదాకా కూర్చుని నిద్రొస్తోందని వెళ్ళిపోయింది. బహుశా మేం మాట్లాడుకునే వాళ్ళ గురించి తనకి తెలీదు కాబట్టి విసుగు పుట్టి ఉంటుంది.

మర్నాడు నేను లేచేసరికి పది దాటింది. పూల పూల గౌనులో ఉన్న సంజన నాకు కాఫీ ఇస్తూ చెప్పింది.

"ఆకాష్ ఆఫీస్‌కి వెళ్ళిపోయారు. కారు వదిలేసి బస్‌లో వెళ్ళారు. మిమ్మల్ని బయట తిప్పమన్నారు."

వాడు చెప్పినట్లే చెప్పిన ఆ మాటలకి నాకు నవ్వొచ్చింది.

సంజన నాకు చక్కటి తెలుగు భోజనాన్ని వడ్డించింది. అంత స్టైలిష్‌గా వున్న అమ్మాయి అన్ని వంటలు చేయడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. సన్నగా 'అధరం మధురం' అంటూ మధురాష్టకం వినిపిస్తోంది.

"కావేరి కర్ణాటక సంగీతం బాగా పాడేది" ఐస్క్రీం కప్ అందిస్తూ చెప్పింది.

"కావేరి ఎవరు?"

"మా ఊళ్ళో ఉంటుంది. తన జుట్టు జడ వేస్తే మోకాళ్ళదాకా, విప్పితే మడమలదాకా వచ్చేది."

"అయ్యబాబోయ్" అప్రయత్నంగా అన్నాను.

"ఇలా పొట్టి జుట్టుకాదు. దానికి పెద్ద జుట్టని గర్వం. దాని సంరక్షణకి చాలా సమయం ఖర్చు చేసేది."

"మీరింత మంచి తెలుగు మాట్లాడతారనుకోలేదు. ఏర్‌పోర్ట్‌లో చూసినప్పుడు అసలు మీకు తెలుగు వస్తుందని కూడా అనుకోలేదు" నిజాయితీగా చెప్పాను.

"ఇక్కడ ఉంటున్నా పెరిగింది ఆంధ్రానే కదండీ" నవ్వింది.

బయటంతా చల్లగా ముసురుగా ఉంది. ఇద్దరం సైట్ సీయింగ్‌కి బయలుదేరాం. కారెక్కి స్టార్ట్ చేయగానే సంజన ఫోన్‌నించి శాస్త్రీయ సంగీతం పెట్టింది.

"మీకు క్లాసికల్ మ్యూజిక్ అంటే ఇష్టమా?" అడిగాను.

"చాలా. కావేరి చాలా బాగా పాడేది" చెప్పింది.

ఇప్పుడు ఆమె ప్రసక్తి ఎందుకో నాకు అర్థంకాలేదు.

"కావేరి అంటే మీకు ఇష్టం అనుకుంటాను? మీ బెస్ట్ ఫ్రెండా?"

"అవును. ఆకాష్‌కి తనంటే ఇష్టంలేదు. అందుకని తన దగ్గర కావేరి గురించి మాట్లాడను" విచారంగా చెప్పింది.

తెగ బారెడు జుట్టుతో, త్యాగరాజ కీర్తనలు పాడే చీరలు కట్టుకునే అమ్మాయిలంటే ఆకాష్‌కి అలర్జీ అని నాకు తెలుసు.

"మనం వెళ్ళే చోటుకి ఇంకా అరగంట పడుతుంది. మీకు కావేరి గురించి చెప్పనా?" అడిగింది.

నాలాంటి ఎలిజిబుల్ బేచులర్ కనిపించగానే సంజన తన స్నేహితురాలి గురించి ఆలోచించిందని, నన్ను ఇంప్రెస్ చేసేలా ఆమెని పొగుడుతూ ఆమె గురించి చెప్పాలనుకుంటోందని నాకు అర్థమైంది.

"చెప్పండి."

"కావేరికి అమ్మలేదుకదా. అందుకని వాళ్ళ నాన్నగారు మరీ పద్ధతిగా పెంచారు. ఇంటిదగ్గర దించిన తల స్కూల్లోనే ఎత్తడం. ఇంటిపనులన్నీ నేర్చుకుంది. కర్నాటక సంగీతం నేర్చుకుంది. ప్రతి శనివారం తప్పనిసరిగా గుడికి వెళ్లేది. ఊళ్ళో అందరూ వాళ్ళ ఆడపిల్లల్ని 'కావేరిని చూసి నేర్చుకోండి' అనేవాళ్ళు. ఏనాడూ తనకేం కావాలో నోరు విడిచి అడిగేదే కాదు. వాళ్ళ నాన్న తెచ్చిన బట్టలు వేసుకునేది. ఫేషన్‌గా ఉండాలి అనుకునేది కాదు. డిగ్రీలో అంతా పంజాబీ డ్రెస్సుల్లో వస్తే, కావేరి ఒక్కటే చీరల్లో వచ్చేది. అందరూ పాపం 'అమ్మమ్మ' అని వెక్కిరించేవారు."

'నిజమే కదా?' అనుకున్నాను.

ఆ తర్వాత సంజన కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆమెకి వాళ్ళు ఊరు గుర్తొచ్చి, ఇండియా మీద దిగులొచ్చిందని మాట మార్చాను.

"మీకు నార్వే నచ్చిందా?"

"ఇంతకు ముందు సిసిలీలో ఉండేవాళ్ళం. అక్కడ ఎక్కువ బావుంది. సన్నీగా, సందడిగా ఉండేది. ఇక్కడ డిప్రెసింగ్ వెదర్. సూర్య భగవానుడిని చూడందే అన్నం తినని వాళ్ళుండేవాళ్ళు మా ఊర్లో. వాళ్ళు ఇక్కడికి వచ్చారంటే, నెలల తరబడి సూర్యుడి దర్శనం లేక మాడి చస్తారు."

నవ్వాను.

"అప్పుడప్పుడూ ఆకాష్ ఫ్రెండ్స్ వస్తూంటారు. వాళ్ళు రాగానే 'వావ్! నైస్ వెదర్. నైస్ సిటీ' అంటారు. అది వింటే నాకు నవ్వొస్తుంది. నిజంగానే రెండు మూడు రోజులు ఉండిపోవడానికి బావుంటుంది కాని, ఏళ్ళ తరబడి ఉండటం కష్టం. ముఖ్యంగా మూడొందల అరవై రోజులు ఎండవుండే మన సౌత్ ఇండియన్స్‌కి" చెప్పింది.

సంజన చాలా సమర్థురాలని ఆమె వ్యవహరించిన తీరుతో నాకు అర్థమైంది. టిక్కెట్స్ దగ్గర నాకు డిస్కౌంట్ ఇప్పించింది. వాళ్ళతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ కాంటిన్‌లో మాకు వెజ్ స్నాక్స్ చేయించుకొచ్చింది. ఒక గైడ్‌లాగా అన్నీ తిప్పి చూపించింది.

"మీ ఇంటి అలంకరణ చూసి, వంటలు రుచి చూసి  మీరు మంచి హోమ్ మేకర్ అనుకున్నాను. ఇవాళ పబ్లిక్‌తో మీరు మేనేజ్ చేసింది చూసాక ఇంటా బయటా కూడా సమర్థులే అని అర్థమైంది" తిరుగుప్రయాణంలో మెచ్చుకున్నాను.

"అంతా ఆకాష్ నేర్పారు. పెళ్ళయిన కొత్తలో మట్టిముద్దని. ఆయన సానబెట్టారు" నవ్వింది.

"కాదు. ముడి వజ్రం అనుకోండి" చనువుగా చెప్పాను. మేం వెళ్ళేసరికి ఆకాష్ వచ్చేసాడు.

***

నేను అక్కడున్న ఐదురోజులు సంజన నాకు కావేరి గురించి చెప్తూనే ఉంది. ఆకాష్ ముందు మాత్రం ఆమె ప్రసక్తి తెచ్చేది కాదు. వినగా వినగా నాకు కావేరిమీద ఆసక్తి కలిగింది. ఇంత అధునాతనంగా ఉండే సంజన మంచి ఇల్లాలుగా ఉన్నప్పుడు అసూర్యంపశ్యలాంటి కావేరి ఇంటిని, నన్ను ఎంత బాగా చూసుకుంటుందో అని ఆశ పుట్టింది.

ఆ రోజు ఉదయం నిద్రలేవగానే ఫేస్ బుక్ చూసిన నాకు ఆరోజు వినాయక చవితని తెలిసింది. స్నానం చేసి వచ్చి సంజనని అడిగాను.

"మీ దేవుడు ఎక్కడున్నాడు? అక్కడ గణేష్ ఉన్నాడా?"

సంజన కళ్ళల్లో నీలినీడలు.

"ఆకాష్‌కి దేవుడి మీద నమ్మకం లేదు. కావాలంటే ఇంట్లో   బొమ్మలు పెట్టుకో కాని దేవుడి బొమ్మలు ఉండటానికి వీల్లేదన్నారు" చెప్పింది.

మద్రాస్ ఐఐటిలో చదివేప్పుడు, ముఖ్యమైన ఎసైన్‌మెంట్స్ ఎగ్జామ్స్ ఉన్నప్పుడు ఆకాష్ గుడికి వెళ్ళి తమిళ సాంప్రదాయంలో ముఖాన విబూది పెట్టుకోవడం నాకు తెలుసు. వాడు అకస్మాత్తుగా నాస్తికుడు ఎప్పుడయ్యాడబ్బా! అనుకున్నాను. "పర్లేదులెండి. ఫేస్‌బుక్ నిండా రకరకాల వినాయకుళ్ళు ఉన్నారు. దణ్ణం పెట్టేసుకుంటా" చెప్పాను.

భోజనం చేసేప్పుడు అడిగాను.

"కావేరిగారు ఏం చదువుకున్నారు?"

"బి.ఏ తెలుగు మీడియం. మా ఊళ్ళో తెలుగుమీడియమే ఉంది. వాళ్ళ నాన్న అందులోనే చేర్పించారు" చెప్పింది.

నాకు కొంచం అసంతృప్తిగా అనిపించింది. కాని ఓటిటిల్లో చూసిన బెంగాలీ సినిమా హీరోయిన్‌లా ఉంటుందేమో అనిపించింది.

"మీ క్లాస్‌మేట్ అంటున్నారు. అంటే ఈపాటికి చదువైపోయి ఉండాలి. పెళ్ళి కూడా అయిపోవాలి. ప్రస్తుతం ఎక్కడుంది కావేరి?" అడిగాను.

అకస్మాత్తుగా సంజన కళ్ళు నీళ్ళతో నిండాయి.

"కనపడటంలేదు."

"ఏమిటి?" అర్ధంకాక  అడిగాను.

"కావేరి కనపడడంలేదు."

"రిడిక్యులస్! ఏమైంది?"

సంజన సన్నగా రోదిస్తూ చెప్పింది.

"కావేరి కనపడడంలేదు."

పండగపూట ఆమెని బాధపెట్టాననిపించి చెప్పాను.

"సరేసరే. ఏమైందో తర్వాత చెపుదురుగాని వదిలెయ్యండి."

మర్నాడు నేను వెళ్ళిపోతున్నానని ఆరోజు ఆకాష్ త్వరగా వచ్చాడు. దాంతో నేను సంజనని కావేరి గురించి అడగలేకపోయాను.

మర్నాడు ఏర్పోర్టుకి బయలుదేరాం. నన్ను దింపేసి, తను అటునించి ఆఫీస్‌కి వెళ్ళిపోతానని ఆకాష్ చెప్పడంతో సంజన మాతో రాలేదు.

దారిలో ఆకాష్ అడిగాడు.

"సాగరిక గుర్తుందా?"

"ఎవరూ? నీ ప్రేయసా? గుర్తుంది. నీ ఫస్ట్ క్రష్. ఢిల్లీ అమ్మాయి" చెప్పాను.

"తనకి నేను ప్రపోజ్ చేసానని తెలుసా నీకు?"

"అవునా? నాకు తెలీదే! ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాను.

"మన చివరి ఎగ్జాం రోజు. ఏమందో తెలుసా?"

"సంజనని చేసుకున్నావంటే, నో చెప్పి ఉంటుంది."

"నో చెప్పడంకాదు. హేళన చేసింది. 'మీ సౌతిండియన్స్ నల్లగా రాక్షసుల్లా ఉంటారు. గుళ్ళూ గోపురాలు తిరుగుతూ అసహ్యంగా గుండు చేసుకుని మీసాలతో సహా తీసేసి తిరుగుతారు. నీకు నేను కావాల్సి వచ్చానా? నీలాంటి శూర్పణఖనే చేసుకో అంది."

"అంత మాటందా? మరి సౌత్‌లో ఎందుకు చదివింది?" నివ్వెరపోతూ అడిగాను.

"అక్కడ సీట్ వచ్చింది కాబట్టి."

"పోన్లే. సంజన బంగారం. ఆ అహంకారిని చేసుకో కుండా మంచిదైంది" చెప్పాను.

"ఆ మాటలకే పంతంగా తెల్లటి అమ్మాయి కావాలని సంజనని చేసుకున్నాను. పెళ్ళినాటికి తను ఉత్తమోటు మనిషి. కష్టపడి మార్చాను. పాత చింతకాయ పచ్చడిలాంటి పేరుని సంజనగా మార్చాను. ఫేషన్లు నేర్పించాను. ఇంగ్లీష్ మాట్లాడటం డ్రైవింగ్ అన్నీ. తనని ఒక శిల్పంగా మలచుకున్నాను. ఇప్పుడు సంజన సాగరిక కంటే ఫేషన్‌బుల్‌గా, అరిస్టోక్రాటిక్ గా కూడా ఉంటుంది. ఐయాం వెరీ హేపీ నౌ" ఆకాష్ చెప్పాడు.

"కానీ తనకి ఒక వ్యక్తిత్వం, ఇష్టాలు ఉంటాయిగా ఆకాష్. ఎవరి మీదో కసితో, ఆమె రెప్లికాగా మార్చాలనుకోవడం తప్పు. సంజనకి కూడా మనసుంది" చెప్పాను.

"తనకి ఇప్పుడు వచ్చిన నష్టం ఏమిటి? హాయిగా ఉంది. సాగరిక మెకానికల్ బ్రాంచ్ పరాగ్‌నిచేసుకుని ఢిల్లీలో ఉంటోంది. ఎప్పుడైనా కలిసి సంజనని చూపించాలని నా కోరిక" కసిగా చెప్పాడు.

కారు ఏర్‌పోర్ట్ డిపార్చర్స్ ఎంట్రన్స్ దగ్గర ఆగింది. నేను కారుదిగి, డిక్కీలోంచి సూట్‌కేస్, లాప్‌టాప్ బేగ్ తీసుకుని ఆకాష్ వైపు వెళ్ళి వీడ్కోలు చెపుతూ సందిగ్ధంగా అడిగాను.

"సంజన అసలు పేరేంటి?"

"కావేరి."

ఆకాష్ కారు కదిలి నెమ్మదిగా కనుమరుగైంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments